

# ఉష్ట్ర పక్షులు

కలిసొచ్చే రోజొస్తే నడిచొచ్చే కొడుకు పుట్టడం అంటే ఇదేనేమో. ఎన్నాళ్ళనుండో తీరని కోరికల్లో ఒకటి ఎండాకాలం బెంగుళూరు వెళ్ళడం, దానికిస్వంత ఖర్చుతో వెళ్ళే తెగింపూ లేదు. అవసరం కూడా రాలేదు.

ఒక ఉదయం మా బాస్ నన్ను పిల్చి "మూడు రోజులపాటు ట్రైనింగ్ కోర్స్ ఏదో బెంగుళూర్‌లో నడుపుతున్నారట మన డిపార్ట్‌మెంట్. మన బ్రాంచి నుంచి ఒకర్ని పంపక తప్పదన్నారు. నువ్వే వెళ్ళాలి" అన్నాడు.

మనసులో సంతోషంగా ఉన్నా ఏదో కాస్త చిక్కు ప్రశ్న విడదీస్తున్నట్లు మొహం పెట్టి సరే మీరు చెప్పాక కాదంటానా అన్నాను. ఆ మధ్యాహ్నామే మా ఉద్యోగుల సంఘం కార్యకర్తలు నన్ను పిలిచి శుక్రవారం జరగబోయే దక్షిణ మండలం సమావేశానికి ప్రతినిధిగా నన్ను పంపుతున్నారు. ఒక చిన్న స్పీచ్ కూడా తయ్యారు చేసి చదవాలన్నారు బెంగుళూరులో. రానూ పోనూ ఖర్చుకి కొంత సొమ్ము చేతిలో పెట్టారు.

తర్వాత రెండురోజులు సెలవుకూడా ఉంది. నా చేద్ది పడకుండా నా కోరిక నెరవేరడం ఊరికి ఉపకారిలా బెంగుళూరు వెళ్ళి రావడం అదృష్టమే మరి.

రైలు అనుకున్నట్లు వేళకి బెంగుళూరు చేరుకోలేదు. నాకేమో ఊరు కొత్త. అందుకే హడావిడిగా స్టేషన్‌కి దగ్గరగా ఉన్న లాడ్జికి వెళ్ళి ఒక గది కావాలన్నాను. 'ఆర్డినరీ గదా? డీలక్స్ గదా?' అని అడిగాడు కౌంటర్లో కుర్రాడు. ఎదురుగా బోర్డుమీద అద్దె రేట్లు పెద్దక్షరాలతో కనుపిస్తూనే ఉన్నాయి. ఎందుకైనా మంచిది ఆర్డినరీ గది చాలన్నాను. కాస్త నా సిగరెట్లు ఖర్చులైనా కలిసొస్తాయని జాగ్రత్తపడ్డాను. ఒక్కటే గది ఖాళీగా ఉందని తాళం చెవి ఇచ్చి చిన్న కుర్రవెధవని నా వెంట పంపాడు.

నాలుగో అంతస్తులో మారుమూలగా ఉంది. ఇరుకైన గది. తొందర తొందరగా స్నానం చేసి బట్టలు మార్చుకొని, తాళం చెవి కౌంటర్లోనే ఇచ్చి బయట పడ్డాను.

సాయంత్రం ఆలస్యంగా తిరిగివచ్చి కౌంటర్లో నా గది తాళం చెవి అడిగాను. "మీ గది మార్చేశాను. ఇదిగో రెండో అంతస్తులో ఇరవై రెండో గది తాళం" అని చేతికిచ్చాడు — కౌంటర్లో కుర్రాడు. నా గదిని ఎందుకు మార్చినట్లూ? అని అనుకుంటూ రుసరుసలాడుతూ గది తెరిచాను.

గది విశాలంగా ఉంది. కిటికీలకి కర్టెన్లూ, కాలి కింద కాయిర్ మాట్, టెలిఫోనూ చూస్తూ ఏదో పొరపాటు జరిగి ఉంటుందని వెంటనే కిందకి ఫోన్ చేశాను. నేను ఉదయం నా ఇరుకు గదిలో విడివిడిగా పరిచిన పుస్తకాలూ నా సామాన్లూ ఇక్కడికి జాగ్రత్తగానే చేర్చి పెట్టారు.

కౌంటరులో ఫోన్ ఎత్తగానే నా గదిని ఎవర్నడిగి మార్చారు. దీని అద్దె ఎంత? ఎవరిచ్చుకుంటారని మార్చారు? అని ఆవేశంతో అరుస్తున్నాను. అవతల మనిషి తడబడుతూ ఏదో నీళ్ళు నముల్తూ ఉండండి అడుగుతానని నసుగుతున్నాడు.

ఇంతలో టెలిఫోన్‌లోంచి కొత్త గొంతు స్పష్టంగా వినిపించింది. "ఆగు నానీ ఆగు. అంత కోపం వద్దు. నేను గౌరును..అదే..గౌరీశాన్ని. నీతో చిన్నప్పుడు చదువుకున్న గౌరుగాణ్ణి. ఇప్పుడే వస్తున్నా" అని ఫోన్ పెట్టేశాడు.



తలుపుమీద కాస్త వేళ్ళతో తట్టి లోపలికి వచ్చిన గౌరును చూసి నా మొహంలో నవ్వు పులుముకుని చూశాను. తేనెరంగు లాల్చీ,తెల్లని పైజమాలో ఉన్న గౌరీశాన్ని కష్టం మీద గుర్తు పట్టిన క్షణంలో కాసింత ఈర్ష్య నా అంతరాంతరంలో కలుక్కుమంది.

"ఉదయం రిజిస్టర్‌లో ఇవాళ ఎంట్రీస్ చూస్తూ ఉంటే నా కళ్ళు ఒక పేరు దగ్గర నిల్చిపోయాయి. అక్కడున్న వయస్సు చూశాక ఆ మనిషి నువ్వే ఎందుక్కాకూడదూ అనుకున్నాను. రూంబాయ్‌ని పిలిచి అడుగుతూవుంటే అప్పుడే ఆటోలో వెళ్ళిపోతున్న నిన్ను చూపించాడు. నిన్ను పోల్చుకున్నాక నేను చెయ్యగలిగింది ఇది ఒక్కటే, నీ గదిని చనువు తీసుకుని మార్చేశాను." అన్నాడు గౌరు.

నేను కాస్త ఆశ్చర్యంగా అతని వేపు చూస్తూ ఉంటే "అసలు నీ సామాన్లు నా ఇంటికే తరలించే వాణ్ణి. మరి నీ ప్రోగ్రాం ఏంటో - ఏ పని మీద వచ్చావో తెలీక ఊరుకున్నాను" అన్నాడు ఎంతో శ్రద్ధగా.

నేను ఇంకో మూడు రోజులు చాలా బిజీగా ఉంటాను. కొంత ఆఫీసుకి సంబంధించిన పనీ కొంత మా ఉద్యోగుల ప్రతినిధిగా పనీ ఉంది. నా ఉపన్యాసం తయారు చేసుకోవాలి. ఏదో నోట్స్ రాసుకోవాలి. శనివారం అంతా ఫ్రీగానే ఉంటానులే అన్నాను. అలా నా ప్రత్యేకత కాస్త చెప్పుకుని గౌరు వేపు చూశాను.

"నేను బెంగుళూర్ వచ్చి సుమారు ఐదేళ్ళవుతుంది. ఈ లాడ్జి ఈ మధ్యే ఓపెన్ చేశారు. మొదట నేను కిచన్ సెక్షన్ మేనేజ్ చేశాను. ఇప్పుడు నాకు జనరల్ సూపర్విజన్ ఇచ్చారు. నన్ను ఈ ఊరు పిల్చుకొచ్చిన పార్టనర్ నాకో చిన్న వాటా కూడా ఇస్తానంటున్నాడు" అని కాస్త ఉత్సాహంగా తన గురించి చెప్పాడు.

నేనూరుకోలేక ఇంకేం కేపటలిస్టు వన్నమాటే అన్నాను - అప్రయత్నంగా. ఎంతో ఉత్సాహంగా ఉన్న గౌరు కాస్త హర్ట్ అయినట్టు ఉండిపోయి సంబాళించుకున్నాడు. తర్వాత "సరే నీ పనులు చూసుకో. శనివారం నాతో ఉదయమే ఇంటికి రావాలి" అని అతన్ని ఎవరో పిలవడానికి వస్తే వెళ్ళిపోయాడు.

రాత్రి నిద్ర రాలేదు. నా కాలేజీ చదువులూ, పుస్తకాలతో చేసిన కుస్తీ, పాసయిన పరీక్షలూ, నా ఉద్యోగం, మొరాయిస్తున్న ప్రమోషన్, మా ఉద్యోగుల డిమాండ్లు పెడ చెవిని పెడ్తున్న అధికార్లూ నా మనసులో మెదలగానే నా నిద్ర దూరమైపోయింది.

ఏం చదువుకున్నాడని గౌరు అంత హాయిగా కను

**తే**నెరంగు లాల్చీ, తెల్లని పైజామాలో ఉన్న గౌరీశాన్ని అతికష్టంమీద గుర్తుపట్టిన క్షణంలో కాసింత ఈర్ష్య నా అంతరాత్మలో కలుక్కుమంది.

పిస్తున్నాడు అని పదే పదే ప్రశ్నవేసుకున్నాను. అంత సాఫ్ట్‌గా తిరుగుతున్న ఫాన్ చప్పుడు నా నిద్రను పాడు చేస్తోందా లేక డిస్టర్బ్ అయిన మనసు వల్ల అంత చిన్న శబ్దం కూడా నేను పట్టించుకుంటున్నానా అని వితర్కించుకున్నాను.

ఎనిమిదో క్లాసు తర్వాత నాకు స్కూల్లో కనపడని గౌరు మళ్ళా ఇలా ఎదురవడంతో, గౌరును నేను మొట్టమొదట చూసిన క్షణంనుండీ నేను ఆ కుగ్రామం విడిచి పెట్టే దాకా జరిగిన కొన్ని సంఘటనలు నా కళ్ళముందు సినిమా రీళ్ళలా తిరిగాయి.

చిన్నతనంలో నే నెక్కడికో ఆడుకుందుకు పోతూ వుంటే ఒక వీధి మొదట్లో సుమారు నా ఎత్తు కుర్రాణ్ణి చెట్టుకు కట్టి బెత్తం పుచ్చుకు కొడుతోందొక ఆడమనిషి. ఆ మనిషి కళ్ళు పెద్దవిగా భయంకరంగా ఉన్నాయి. "ఇంట్లో పని ఎగ్గొట్టి గాలిపటం ఎగరేసుకుంటావా" అని పదేపదే అరుస్తూ ఆవేశంతో కొడుతోంది.

అంత క్రూరత్వం, దెబ్బలు తింటూ కూడా ఏడవని మొండితనం నేను అదే చూడ్డం. అలా కొంతసేపు నిలబడి పోయాను. చుట్టూ చేరిన వాళ్ళలోంచి ఎవరో ముసలాయన వచ్చి "చాలు చాల్లేవమ్మా నీకే ఒక మరిది ఉన్నాడు. ఇష్టం వచ్చినట్టు చావబాదితే చూస్తూ ఊరుకుంటారేటి జనం" అని ఆమెకన్నా గట్టిగా అరుస్తూ కట్లువిప్పి ఆ కుర్రాణ్ణి ఎక్కడికో తీసుకుపోయాడు.

మరో వారం రోజుల తర్వాత ఇంట్లో నేను నా పుస్తకాలకి అట్టలు వేసుకుంటూ ఉంటే వీధి వరండాలో ఏవో మాటలు వినిపిస్తున్నాయి.

"నేను నాలుగు పాసయ్యానండీ. ఇంక నేను చదువు చెప్పించలేను. వారాలు చేసుకుంటే చదువుకో లేకుంటే మానుకో అనేసింది మావదినె. నాకైతే చదువుకోవాలని ఉంది...."

"మరి నీకు వారాలన్నీ దొరికాయా?" అమ్మ ప్రశ్న

"ఒక్క శుక్రవారం దొరకలేదు" గొంతులో దైన్యం.

"ఆచేతి మీద ముడతలేంటి?"

"మరిగిన నూనె ఒలికింది"

"ఎలా?"

"వంట చేస్తూ ఉంటే..."

"నువ్వు వంట కూడా చేస్తావేంటి?"

"మా వదినెకు ఒంట్లో బాగుండకపోతే నేనే వండుతాను. మావదినె ఒప్పుకుని ఎవరింటికైనా నన్ను వంపిస్తే పోయి వండుతా."

"మీ అన్న ఏంచేస్తాడు?"

"చింతచెట్టుకింద పేకాడేవాడు. ఒకరోజు ఎవరో కొట్టి మా ఇంటి ముందు పడేసిపోయారు. కొన్నాళ్ళు మంచాన పడి పోయాడు....."

"మీ అమ్మానాన్నాలేరూ?"

"వాళ్ళు పుష్కరాలకి వెళ్ళి పడవలో మునిగి పోయారు..."

"సరి సరి....ఏడిసినట్టే ఉంది నీ బతుకూ నువ్వూ. శుక్రవారం రెండుపూట్లా వచ్చి మా నానీతో తిని చదువుకో.." అంది అమ్మ. నేను అప్పుడు కిటికీ లోంచి చూశాను. సరిగ్గా వారం రోజుల కిందట దెబ్బలు తింటూ కనిపించిన వాడే అమ్మతోమాట్లాడుతున్నాడు.

నాలుగు రోజుల తర్వాత క్లాసులో నా పక్కనే కూర్చుని "ఇవాళ చేరాను. డ్రిల్లు మాస్టరు గారు నాకు స్కూల్ ఫీజు కట్టారు...." అన్నాడు విజయగర్వంతో. అలా నా బాల్యంలోకి వచ్చాడు గౌరీశం ఉరఫ్ గౌరు.

ఇంకో రోజు మాక్లాస్ టీచర్ దేశపటం బ్లాక్‌బోర్డు మీద పరిచి తూర్పున బంగాళాఖాతం, పడమట అరేబియా సముద్రం అంటూ ఎల్లలు చూపిస్తున్న క్షణంలో స్కూళ్ళ ఇన్స్‌పెక్టర్ గారూ వెనకనే హెడ్ మాస్టరు గారూ వచ్చారు క్లాసులోకి.

"ఈ పిల్ల వెధవలకి ఎల్లలంటే ఏంటో, అసలు వాళ్ళ ఊరికి ఎల్లలు ఏంఉన్నాయో దిక్కులంటే ఏంటో ఏమైనా అవగాహన ఉంటుందంటారా?" అన్నారు—ఇన్స్‌పెక్టర్‌గారు నవ్వుతూ. ఒక్కొక్క పిల్లాణ్ణి నిలబెట్టి "మీఊరికి ఎల్లలు చెప్పు" అడిగారు ఆయనే.

మేమంతా కంగారు పడి ఒకరి తర్వాత ఒకరం నిలబడిపోయాం. గౌరు వంతు వచ్చింది. ఏదో ఆలోచిస్తూ కిటికీలోంచి దూసుకు వస్తున్న ఎండవేపు మొహం పెట్టి, ఒకమారు వాడి కుడి చేతినీ ఎడమచేతినీ సవరించుకుంటూ, 'తూర్పున పాపయ్య కోనేరూ, పడమట చింతామణి మెట్టా, ఉత్తరాన ఊరచెరువూ...అంటూ నెమ్మదిగా చెప్పాడు.

మా టీచర్ మొహం చాటంతగా వికసించింది. ఇన్స్‌పెక్టర్‌గారు తృప్తిగా 'కుర్రాడు గట్టివాడే' అని వీపు తట్టి వెళ్ళిపోయారు. ఆరోజు మాక్లాసులో గౌరు హీరో. మేమంతా కాస్త సిగ్గుపడ్డాం.

అలాంటి గౌరు ఎనిమిది పాసయ్యాక క్లాసుకి రావడం మానుకున్నాడు. మా ఇంట్లో శుక్రవారం భోజనానికి కూడా రావడం మానేశాడు. రిటైర్ అయి ఒంటరిగా బతుకుతున్న డ్రిల్లు టీచర్‌కి వండిపెట్టి తనూ అక్కడే తింటూ తిరుగుతున్నాడని మా వీధి చివర్న చిన్న కిరాణాదుకాణం నడుపుకుంటున్న సీతయ్య కూతురు వరాలు నాతో చెప్పింది.

గౌరు మా ఇంటికి రావడం మానిందగ్గర నుండీ నాకు మా అమ్మతో చీవాట్లు తప్పిపోయాయి. ఏదోసందర్భంలో తరచూ అదుగో గౌరుని చూసి కాస్త 'మప్పితం నేర్చుకో' అని హెచ్చరిస్తూ నన్నుకించపరిచేది.

ఒకరోజు నాపుట్టిన రోజుకు పెరుగ్గారెలు చెయ్యాలని అమ్మ పప్పునానబోసింది. అమ్మకుడిచెయ్యి పొద్దున్నే బెణికి ఇరుకుపట్టింది. 'ఇప్పుడెలాగ, రోజూ కనిపించే వరాలు కూడా రాలేదు. గౌరుని పిలుస్తావా?' అని అడిగింది. వాడు దొరకడు, అన్నాను.

సరిగ్గా అదే సమయంలో ఎక్కడికో పరిగెడుతున్న గౌరు అమ్మకు వీధిలో కనపడ్డాడు. గౌరుని పిలిచి బతిమాలుకుంది. 'నా చెయ్యి ఇరుకుపట్టింది. కాస్త పప్పు రుబ్బితే నేను గారెలు దేవుతాను, అంది. చేతులూ కాళ్ళూ బావి దగ్గర కడుక్కుని వచ్చి అవలీలగా పప్పు రుబ్బి పెట్టాడు. అమ్మని పొయ్యి దగ్గరకైనా రానీకుండా గారెలు వేయించి నిలబడ్డాడు. గారెలు ఎంతో రుచిగా ఉన్నందుకు ఎంతో పొంగి పోయింది అమ్మ.

గౌరు వాటా గారెలు దండిగానే ప్లేట్లోపెట్టి తిన మన్నది. నాను తీసుకుపోతానని పొట్లం కట్టుకుని పోతున్న గౌరుని కాస్త నిలబడమని నాదొక పంట్లాం పెట్లోంచి తీసి ఇచ్చింది. నేను ఆ పంట్లాం నాక్కావాలని పేచీ పెట్టాను. గౌరు దాన్ని తీసుకున్నట్లే తీసుకుని వీధి కిటికీలోంచి గదిలోకి పడేసి వెళ్ళిపోయాడు. అమ్మ ఆతర్వాత ఆ పంట్లాం చూసి నన్నురోజంతా చీవాట్లు పెట్టింది.

నేను కాలేజీ చదువుకు వచ్చాక నాన్నగారు ఆ ఊరు నుండి బదిలీ చేయించుకున్నారు. ఆ గ్రామం వదిలేశాంమేమంతా. అలా ఆఊరితో సంబంధం తెగిపోయాక ఇన్నేళ్ళతర్వాత ఇలా నేను గౌరుని చూశాను.

ఈమధ్య కాలంలో గౌరు జీవితంలో ఇంత మార్పు తెచ్చిపెట్టిందంటే, అది ఎలా సాధ్యం అన్న ప్రశ్నకి జవాబు కావాలంటే శనివారం గౌరు ఇంటికి వెళ్ళాలి. ఈలోగా గౌరు సడగాలన్న ఆరాటానికి ఎందుకనో కళ్ళెంవేశాను.

మరో రెండు రోజులు ట్రైనింగ్ కోర్స్ — రీజినల్ ఇన్‌స్టిట్యూట్‌లో పూర్తిచేశాక శుక్రవారం సమావేశానికి వెళ్ళాను. ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి, వేతనాలు పెంచాలి, ప్రపంచకార్మికులంతా ఏకంకావాలి, బ్యూరోక్రసీ డౌన్ డౌన్, హమారీ మాంగే లేకే రహేంగే అంటూ నినాదాలు చేశాం. నా వంతు రాగానే నేను రాసుకుని శ్రద్ధగా రిహార్సల్ చేసుకున్న ఉపన్యాసం అందరికీ వినిపించాను. అవకాశం దొరికిన మేరకు సిటీ అంతా గత నాల్రోజులూ కాస్త కాస్త తిరిగాను.



**చిన్నతనంలోనేను ఆడుకుందుకు పోతూవుంటే వీధి మొదట్లో నాఎత్తు కుర్రాణ్ణి చెట్టుకు కట్టి బెత్తం పుచ్చుకు కొడుతోందొక ఆడమనిషి**

శనివారం ఉదయం నన్ను ఇంటికి తీసుకు వెళ్తున్న గౌరు 'ఈ మారు మీ అమ్మగార్ని తీసుకు రావాలని' అన్నాడు ఆశగా.అమ్మ పోయిందంటే సులభంగా నమ్మలేనట్లు చూశాడు నా కళ్ళలోకి.

నాపెళ్ళి అయిన రెండేళ్ళకే అమ్మ పోయింది. నాన్నగారికి తెలిసిన సంబంధమే చేసుకున్నానని చెప్పాను. ఇలా మాట్లాడుతూ ఉంటే గౌరు ఇల్లు రానే వచ్చింది. ఇల్లు చిన్నదే. లాడ్జికి దగ్గరలోనే సంపాదించాడు. ముందుగదిలో గోడకి వేలాడుతున్న ఫోటో నన్ను ఒక్క క్షణం గాభరా పెట్టేసింది. అవే కళ్ళు, అదే తీక్షణమైన చూపు, ఆచూపులో ఏదో క్రౌర్యం. ఆ ఫోటో గౌరు వదినెది.

'లోపలకు రా, ఇక్కడ నిలబడి పోయావేంటి' అని గౌరు నన్ను తీసుకుపోతూ ఉంటే చంకలో చంటి పిల్లతో ఎదురైన వరాలు నన్ను ఆశ్చర్యంలో పడేసింది. ఒక ఆశ్చర్యంలోంచి తేరుకునేలోగా ఇంకో ఆశ్చర్యం కెరటంలాగ నా మొహాన కొట్టింది. మేంకూర్చుని మాట్లాడబోతూ ఉండగా ఎవరో వచ్చి గౌరును కన్నడంలో పలకరించి ఏదో చెప్పాడు. "నానీ...నేనిప్పుడే వెళ్ళి వస్తాను. నువ్వు మాట్లాడుతూ ఉండు." అని గౌరు లాడ్జికి వెళ్ళాడు.

నాకంతా వింతగా ఉంది వరాలూ అన్నాను నాకున్న చనువుతో. 'చాలా ఏళ్ళ తర్వాత కలిశావు. వింతగానే ఉంటుంది మరి' అంది నిర్మలంగా నవ్వుతూ.



గౌరు అతని వదినె ఫోటోను అభిమానంగా పెట్టుకున్నాడు. నాకు ఆ ఫోటో చూడగానే చిన్నతనం జ్ఞాపకం వచ్చి ఒక్కమారు భయంవేసింది అన్నాను — తెలియని గౌరు జీవితాన్ని కాస్త తెలుసుకోవాలని.

"రెండేళ్ళ క్రిందట ఎవరో మన ఊరునుండి ఉత్తరం రాశారు. గౌరువాళ్ళ వదిన మంచాన పడినదని. గౌరు వెళ్ళి ఆచిన్న ఇంటిని అన్న కూతురికి ఇచ్చేసి వదిన్ని ఇక్కడకు తెచ్చేశాడు. ఈ మధ్యనే ఇక్కడే పోయింది" అంది వరాలు.

"నీకూ గౌరుకూ పెళ్ళి ఎలా జరిగింది? ఆ ఊర్లో రెండు కులాలు కలవడమే?" అన్నాను.

"నీకిప్పుడు ఆకథ చెప్పక తప్పదు కదూ, మానాన్న కున్న దేమిటో నీకు తెలీదూ? ఆకాస్తా పోగుచేసి మా చిన్నాన్నగారి ఊరి సత్రంలో నా పెళ్ళి చెయ్యడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. పెళ్ళి వంటకి గౌరుని బతిమాలి తీసుకెళ్ళాడు. రాత్రి పెళ్ళి అయిందనగానే కట్నండబ్బూ కానుకలూ మూటకట్టుకుని ఒక్కొక్కరే విడిదిలోంచి పరారయి పోయారు. వాళ్ళంతా ఒక మోసగాళ్ళముఠా అని తెలుసుకున్న మానాన్న రెండురోజుల వరకూ మాటామంతీ లేకుండా కుప్పకూలిపోయాడు. గౌరు మానాన్నకి ధైర్యం చెప్పాడు. బస్సుస్టాండ్ దగ్గర ఒక చిన్న పాక వేసి టీ దుకాణం పెట్టి, పెళ్ళికి తెచ్చిన పప్పూ బియ్యం, వెచ్చాలతో ఇడ్లీ దోశ చేసి కొంత డబ్బుకింద మార్చాడు. నేనింక నా స్వంత ఊరు పోయి నామొహం చూపనని కూర్చున్న నాన్ననూ నన్నూ ఆఊర్లో కాస్త నిలబడేలా చేశాడు." అని చెప్తున్న వరాలు ఉండు కాఫీ అయినా ఇవ్వకుండా కూర్చోబెట్టా నంటూ వంటింట్లోకి వెళ్ళి కాఫీతో వచ్చింది.

నేను కాఫీ తాగుతూ నెమ్మదిగా ఎదురు చూస్తున్నాను వరాలు చెప్పబోయేది వినాలని.

"ఇలా బరువుగా రోజులు గడుస్తూ ఉంటే బెంగుళూరు నుండి ఏదో వ్యాపారం కోసం అటు వచ్చిన పెద్దమనిషి ఒకడు ఏదో బంద్ జరగడం వల్ల ఆ ఊరులో చిక్కుకుపోయి టీకొట్లో టిఫిన్ తీసుకున్నాడు. గౌరును చూస్తూ 'నాతో బెంగుళూరు రా, నాకు తోచిన సహాయం నే చేస్తాను' అన్నాడు. 'నన్నూ నావరాల్నీ విడిచిపెట్టి వెళ్ళిపోతావా గౌరూ' అన్నాడు నాన్న. గౌరు నాన్నని ఓదార్చి నేనలా వెళ్ళనన్నాడు. నన్నడిగిన తర్వాత రిజిస్టరు మారేజీ చేసుకున్నాడు. అలా పెళ్ళి అయ్యాక బెంగుళూరు పెద్దమనిషి ఇచ్చిన అడ్రసుతో, బరోసాతో మేం ముగ్గురం ఇక్కడకు చేరుకున్నాం. అదిగో ఆగదిలో పడుకున్నాడు మానాన్న" అంది వరాలు.

ఇలా మాట్లాడుకుంటూ ఉంటే గౌరు తిరిగి వచ్చాడు. మధ్యాహ్నం వాళ్ళతో గడిపాను. ఆ సాయంత్రం కబ్బన్‌పార్క్ ప్రాంతంలో నేనూ గౌరూ నడుస్తున్నప్పుడు 'మీవదిన నిన్ను చెట్టుకు కట్టి కొట్టడం జ్ఞాపకం ఉందా? చిన్నప్పుడు నేను చూసిన ఆదృశ్యం ఇప్పటికి నాకు కళ్ళకి కట్టినట్టు కనిపిస్తుంది' అన్నాను.

ఎటోచూస్తూ "ఆ పరిస్థితుల్లో వదినేంచేస్తుంది పాపం. మాఅన్న చేసిన నిర్వాకం ఏమిటి? ఏ ఆస్తి ఏ ఆదాయం లేకుండా ఆమెను చేసుకుని అన్యాయం చెయ్యడమే కాదు. ఒక కూతురి బాధ్యత కూడా ఇచ్చి మరీ పోయాడు. నన్నెలా చదివిస్తుంది. ఆకసి ఎప్పుడైనా నామీద చూపించేది. వదిన నాకు నేర్పిన వంట నన్ను నిలబెట్టిందని అప్పుడప్పుడూ అనుకుంటూ ఉంటాను" అన్నాడు గౌరు. అలా అని ఊరుకోలేదు.

"లోకంలో నేనే అనుకుంటే నాకన్నా దౌర్భాగ్యులింకా ఎందరో. వాళ్ళందరికీ జీవితం వడ్డించిన విస్తరి కాదు. నిప్పులు కురిసే ఎండ లాటిది. తలమీద కొట్టే వడగళ్ళ వాన లాటిది. వాళ్ళకి ఏనీడ దొరికితే అక్కడ తలదాచుకోడమే. ఆనీడ మంచిదా చెడ్డదా అన్న ఆలోచన ఎక్కడ?" అన్నాడు. ఈ మాటలు కాస్త సూటిగానే నన్ను తాకినట్లయింది, భుజం తడుముకున్నాను.

ఆ రాత్రి గౌరునన్ను నాగదిలో విడిచిపోడానికని రెండో అంతస్తుకి వచ్చాడు. మధ్యహాల్లో ఏదో ఉపన్యాసం. ఏదో కార్యక్రమం జరుగుతోంది. "మాకివి అలవాటే రా, పదినిమిషాలు కూర్చుని పోదాం" అన్నాడు గౌరు. ఎవరో భారీ మనిషి సిల్కులాల్చీలో మైక్ ముందు ఉపన్యాసం ఇచ్చి ముగించాడు. హాలంతా చప్పట్లు. ఏమిటన్నాడతను? అని అడిగాను కన్నడం అర్థంకాక. "ఈవ్యవస్థ మారాలి, సాహిత్యం బాగా దిగజారిపోతోంది, ప్రజలే ఉద్యమించి రక్షించుకోవాలి అంటున్నాడు" అన్నాడు నిర్లిప్తంగా.

అతనెవరని కుతూహలంగా అడిగాను. "కన్నడ సినిమాలకి పాటలు రాస్తాడు. అతని బ్రేక్‌డాన్స్ పాటలంటే ఇక్కడ వాళ్ళకి చాలా క్రేజ్. ఒక్కోపాటకి కొన్ని వేలు తీసుకుంటాడని ఈమధ్య ఒక నిర్మాత ఈ లాడ్జిలో చెప్తూఉంటే విన్నాను." అన్నాడు ముక్తసరిగా. ఈ వ్యవస్థ మారడం నీకు ఇష్టంలేదా అన్నాను ఊరుకోక.

"నాలాంటి వాడికీ, నాకన్నా దురదృష్టవంతుడికీ సాంఘిక వ్యవస్థ మారిపోతుందంటే భయం ఎప్పుడూ ఉండదు. కాని జీవితంలో ఒక్కపూట అయినా తిండిమాని ఎరగని వాడు ఆకలిమీద కవిత్వం చెప్పినా, ప్రజలేదో చెయ్యాలని తనని ప్రజల్లోంచి మినహాయించుకున్నా ఎందుకో అధైర్యం వస్తుంది. వాడు స్వాగతం చెప్పే కొత్త వ్యవస్థ ఎలాగుంటుందో

**లోకంలో నేనే అనుకుంటే నాకన్నా దౌర్భాగ్యులింకా ఎందరో. వాళ్ళందరికీ జీవితం వడ్డించిన విస్తరికాదు. నిప్పులుకురిసే ఎండలాంటిది.**

అన్న సందేహం కలుగుతుంది" అన్నాడు గౌరు. కాలేజీ చదువు ఎరగని గౌరు అలా నిశితంగా అంటూ వుంటే అంతలోతుగా జీవితాన్ని చూస్తున్నాడనుకోక అతన్ని కదిపినందుకు నొచ్చుకున్నాను.

ఆరాత్రి మళ్ళా నిద్రపోలేకపోయాను. ఏదో ఆలోచిస్తున్నాను. తెల్లవారు జామునే కాస్త మగత నిద్ర పట్టింది. నేనూ గౌరూ పక్కపక్కగా నడుస్తూ విశాలమైన మైదానంలో పోతున్నాం.

తెల్లని మబ్బుల్ని చూస్తూ పరధ్యాన్నంగా పోతున్న గౌరు నడకలో ఏదో లయ, ఏదో తాళం, ఏదో రాజసం. నియమబద్ధంగా సాగుతున్న మేలిగుర్రం ట్రాట్‌లాగ వినిపిస్తోంది అతని గమనం. నేలమీద ఎవరో పెట్టిన చుక్కల గుర్తులు చూసుకుంటూ వాటి మీద అడుగులు వేసుకుంటూ పోతున్న నాకాళ్ళలో ఏదో తడబాటు. నేనేదో ఉష్ట్రపక్షిలా కొంకిరిగా నడుస్తున్నట్టు న్యూనతాభావం. నా బాధలోంచి నన్ను విముక్తి చేస్తూ రూంబోయ్ తలుపుతట్టి టీ తీసుకొస్తానన్నాడు.

గది ఖాళీ చేశాను. గౌరు నాకుకనపడలేదు. కౌంటర్లో కూర్చున్నవాడు నాకు రసీదు ఇచ్చి 'గౌరు మీగది అద్దె చెల్లించేశారు' అన్నాడు. రైలు కదుల్తూ ఉండగా హడావిడిగా వచ్చిన గౌరు నా కంపార్ట్‌మెంట్‌తో కొంత దూరం నడిచివస్తూ 'మీ అమ్మగారులేరు. నా దురదృష్టం. నన్నూ వరాల్నీ చూస్తారనుకున్నాను' అన్నాడు. రైలు వేగం పుంజుకుంటూ ఉంటే చెయ్యి ఊపుతూ వెనక్కు వెనక్కుపోతూ జనారణ్యంలో కలసిపోయాడు. గౌరు గౌరవించింది నన్నా నేను అతనిలో రేపిన అమ్మజ్ఞాపకాలనా అన్న వింత ప్రశ్న నాలోమెదిలింది. ●